ప్రచార చిత్రం





పులిచెర్ల: ప్రచారానికి వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు, పుంగనూరు: పట్టణంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, రొంపిచెర్ల: ఇంటింటి ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి చెక్ పోస్టు వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న 384 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమల మండలం నంజంపేటకు చెందిన వెంకటరమణ, గంగవరం మండలం గంగాపురం గ్రామానికి చెందిన వాలెప్ప కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో అక్రమంగా మద్యం కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా పట్టుబడ్డారని అన్నారు. వారి నుంచి మద్యంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

వైభవంగా తిమ్మరాయస్వామి కల్యాణోత్సవం



స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుడుపల్లె: మండలంలోని సంగనపల్లెలో శ్రీ తిమ్మరాయస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి భూదేవి శ్రీ తిమ్మరాయ స్వామి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణతో మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం స్వామి వారిని రాత్రి పురవీధుల్లో ఊరేగించారు.

నేడు బెంగళూరులో ఆత్మీయ సమావేశం

పలమనేరు: పలమనేరు నియోజకవర్గానికి సంబంధించి బెంగళూరులో ఉంటున్న వారితో ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. బెంగళూరులో వ్యాపారాలు, ఉద్యోగాలు చేస్తున్న వారు, విద్యార్థులతో కాటం నల్లూర్ గేట్ వద్ద గొరివిగెరె గ్రామంలోని జేఎస్ గార్డెన్స్‌లో ఈ సమావేశం ఉంటుందని తెలిపారు.

అన్ని రంగాల్లో రాణించాలి



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని సన్మానిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

వి.కోట: మైనారిటీ ఆడపిల్లలు ఇళ్లకే పరిమితం కాకూడదని, వారు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ఖాజీపేట ఉర్దూ పాఠశాలలో ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన మైనారిటీ విద్యార్థులను శనివారం సన్మానించారు. ఇందులో ఎంఈఓ మాట్లాడుతూ మతిహా సుల్తానా (బైపీసీ) 422, సాలిహా సుల్తానా 420 మార్కులు సాధించి మండలంలో మొదటి రెండు స్థానాల్లో నిలిచారని చెప్పారు. అంతేకాక ఖాజీపేటకు చెందిన బుస్రా వాయల్పాడు మైనారిటీ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థితోపాటు, ఉత్తమ ఫలితాలు సాధించిన మరో పది మంది విద్యార్థులను గుర్తించి సన్మానించి వారికి మెడల్స్‌ను అందించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇలియాజ్ ఉన్నారు.

సంక్షేమం కావాలంటే జగనన్న రావాలి



పంచాయతీలో ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నేతలు

చౌడేపల్లె: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, సర్పంచ్ వరుణ్ భరత్, ఎంపీటీసీ రూపారేఖ ఓటర్లను అభ్యర్థించారు. చౌడేపల్లె మేజరు పంచాయతీలో శనివారం పార్టీ నేతలతో కలిసి ప్రారంభించారు. పథకాలు, సేవలు, అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం సాగింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. పంచాయతీలో చేపట్టిన అభివృద్ధిని చూసి ఓటువేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోయకొండ డైరెక్టర్ పవన్‌కుమార్, నేతలు మంజునాథ్, శివన్న, హరీష్‌రాయల్, కుమార్, అల్తాఫ్, సద్దాం, వహాబ్, రాంకీ, అల్లాభక్షు తదితరులున్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

బైరెడ్డిపల్లె: కుల, మత, వర్గ, పార్టీలనే తారతమ్యాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించడమే లక్ష్యంగా జగనన్న పాలన సాగిందని పలమనేరు ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ అన్నారు. మండలంలోని పట్నుపల్లె సమీపంలో వెలసిన శ్రీ కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. బేలుపల్లె సచివాలయ పరిధిలో పర్యటించి ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు, మహిళలు, యువత ఆయనకు ఘనస్వాగతం పలికారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ఎన్.రెడ్డెప్పను గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, ఆ దిశగా ఆయన పాలన కొనసాగించారన్నారు. ప్రతిపక్ష పార్టీల ఇస్తున్న అమలుకాని హామీలను నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, వైస్ ఎంపీపీలు రూప, నారాయణస్వామి, మండల కన్వీనర్ కార్తీక్, సర్పంచులు రాజప్ప, వెంకటేష్, రమణారెడ్డి, బాలక్రిష్ణగౌడు, జ్యోతమ్మ, దేవేంద్రరెడ్డి, నాగరత్నమ్మ, నారాయణరెడ్డి, చంద్రమౌళీ, రవిచంద్ర, ఎంపీటీసీలు జగదీష్, భాస్కర్‌మొదలి, నాగరాజు, ధనలక్ష్మి, వినాయకం, వైఎస్సార్ సీపీ నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం అందరూ సిద్ధం

వి.కోట: వైఎస్సార్‌సీపీని అధిక మెజారిటీతో గెలిపించుకోవడానికి అందరూ సిద్ధంగా కావాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. మండలంలోని పార్టీ కార్యాలయం వద్ద శనివారం వి.కోట పంచాయతీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం జగనన్న చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జగనన్నను మరోసారి సీఎం చేసుకోవడానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలే ప్రచార అస్త్రాలని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏఒక్క పేదవారికైనా న్యాయం జరిగిందా..? కేవలం టీడీపీ నాయకులు, కార్యకర్తలు జేబులు నింపుకున్నాయన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. జగనన్నకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూడలేక టీడీపీ నాయకులు పొత్తుల కూటమితో ఎన్నికలకు వస్తున్నారని చెప్పారు. మోసకారి బాబు ఎన్ని జెండాలతో జతకట్టినా వైఎస్సార్‌సీపీనే విజయ కేతనం ఎగరవేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిఎస్ నాగరాజు, మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీ తమీమ్, ఉప సర్పంచ్ అక్మల్, నాయకులు బీడాబాబు, కుమారరాజా, ధవనంభక్త తదితరులు పాల్గొన్నారు.



బేలుపల్లెలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న పావనిగౌడ

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

మండలంలోని గ్రామాల్లో చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే సతీమణి పావనిగౌడ అభ్యర్థించారు. మండలంలోని బోయచిన్నాగనపల్లి గ్రామంలో శనివారం ఆమె నాయకులు, కార్యకర్తలతో కలసి పార్టీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి పార్టీ కరపత్రాలను పంపిణీ చేస్తూ వైఎస్సార్‌సీపీ అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలన్న ఉద్దేశంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు ఇచ్చి, ఇల్లు మంజూరు చేశారని కొనయాడారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి విద్యావ్యవస్థలో మార్పులు తేవడంతోపాటూ, ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గతంలో గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉండేవని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి గ్రామంలోనూ లక్షలు ఖర్చుచేసి సీసీ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు దంపతులు, పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15న మంత్రి పెద్దిరెడ్డి పర్యటన



మంత్రి పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: మండలంలో ఈ నెల 15న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మంత్రి పర్యటన ఇలా సాగనుంది. గానుగచింత దాసరిగుడెం, పెండ్లికన్నం గుడి, బోడిపాటివారిపల్లె, రొంపిచెర్ల ఎస్సార్ పెట్రోల్ బంకు, రొంపిచెర్ల షాదీమహల్, శ్రీనివాసా సినిమా థియేటర్, శ్రీనాథపురం కాలని, బండకిందపల్లె పాఠశాల, చెంచెంరెడ్డిగారి పల్లె, చిచ్చిలివారిపల్లె, నడింపల్లె, మల్లెలకప్పాలో గ్రామ పంచాయతీల వారిగా వరుసగా వైఎస్సార్‌సీపీ గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించాలి



సదుం: ప్రచారంలో పాల్గొన్న పెద్దిరెడ్డి ఇందిరమ్మ

సదుం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని నడిగడ్డ పంచాయతీలో శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిని గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరెడ్డి, వైస్ సర్పంచ్ నాగభూషణంరెడ్డి, పుత్రాజు, సుధాకర్ రెడ్డి, తేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనాన్ని ఏమార్చే పనిలో టీడీపీ



కండువా కప్పుకున్న వలంటీర్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

పలమనేరు: టీడీపీ వారికే పచ్చ కండువాలేసి పార్టీలో చేరారంటూ జనాన్ని ఏమార్చుతున్నారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీ నాయుడు ఎద్దేవా చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో కలసి శనివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం పెంగరగుంటలో ప్రచారానికి వచ్చిన మాజీ మంత్రి అమరనాథ రెడ్డి టీడీపీ వారికే పచ్చ కండువాలను చేసి ఊరూరే టీడీపీలో చేరిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, ఎర్రగుర్రప్ప, టీడీపీ వార్డు సభ్యుడు నాగరాజు, మాజీ వైస్ సర్పంచ్ వెంకటేష్ ఆ పార్టీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. గతంలో ఏపార్టీ కూడా ఇలాంటి రాజకీయాలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి, సర్పంచ్ గోవిందుస్వామి, మాజీ సర్పంచ్ కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏమార్చి కండువా వేశారు

గ్రామంలో ఎన్నికల ప్రచారానికి మాజీ మంత్రి అమరనాథ రెడ్డి రావడంతో కొందరు తమ గ్రామస్తులు వలంటీర్ల మీటింగ్ ఉందని ఆయన వద్దకు తీసుకెళ్లి, తనకు బలవంతంగా టీడీపీ కండువా వేశారని పెంగరగుంట వలంటీర్ ధనలక్ష్మి తెలిపింది. తనకు టీడీపీ అంటే ఇష్టం లేదని జగనన్నకోసం కష్టపడాలన్న సంకల్పంతో ఉన్నానని తెలిపారు. అందుకే మండల వైఎస్సార్‌సీపీ నేతల సమక్షంలో ఆమె శనివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కండువా వేసుకున్నారు. ఆమెతోపాటు మాజీ ఉపసర్పంచ్ మారప్ప సైతం పార్టీలో చేరారు.

ఫ్యాను గుర్తుకు ఓటేద్దాం.. సంక్షేమం తెచ్చుకుందాం



ప్రచారం చేస్తున్న సింగం సుధారాణి

రామకుప్పం: ఈసారి ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేద్దాం.. సంక్షేమ ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం అని ఆ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు సింగం సుధారాణి ప్రజలను కోరారు. మండలంలోని బందార్లపల్లి పంచాయతీ కోడిగుండ్లపల్లెలో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. జగనన్న ప్రభుత్వంలో మహిళలకు అందుతున్న పథకాలు, తద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సారి కుప్పం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్న ఎమ్మెల్సీ భరత్‌కు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాల కొనసాగించుకోవడానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని ఆమె ప్రజలను కోరారు.

అమరా.. ఆత్మపరిశీలన చేసుకో!

పుంగనూరు: మాజీ మంత్రి అమరనాథరెడ్డి కుటుంబం ముప్పై ఏళ్ల పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేసిందో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా సూచించారు. పట్టణంలోని చింతలవీధి, కుమ్మరవీధి ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందామని కోరారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి 30 ఏళ్లలో చేయని అభివృద్ధిని ఐదేళ్లలో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసి చూపించారని, దమ్ము ధైర్యం ఉంటే పుంగనూరులో అభివృద్ధి పనులపై పరిశీలనకు రావాలని సవాల్ విసిరారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి తమ పాలనలో పుంగనూరును అభివృద్ధి చేశామని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా మొండిగోడలకే పరిమితమైన ఆర్టీసి డిపోను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసి, ప్రారంభించిందన్నారు. కమీషన్ల కోసం పెండింగ్ పెట్టిన బైపాస్‌రోడ్డును ఎంపీ మిథున్‌రెడ్డి స్వయంగా పూర్తి చేయించారని కొనియాడారు. పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు రిజర్వాయర్ల నిర్మాణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. వీటిని అడ్డుకున్న ఘనత మాత్రం పచ్చదండుదేనని కృష్ణమూర్తి ఎద్దేవా చేశారు. వంద పడకల ఆస్పత్రి, ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు, ఎంబీటీ రోడ్డు విస్తరణ, మినీ బైపాస్‌రోడ్డు, పుంగమ్మ చెరువు కట్ట విస్తరణ, పార్కుల ఏర్పాటు, చెరువులను పటిష్టం చేయడం, హంద్రీనీవా నీటిని చెరువులకు అనుసంధానం చేయడం లాంటి మహత్తర కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేయించారని స్పష్టం చేశారు. ఈ పనుల్లో ఒక్కటైనా అమరనాథరెడ్డి కుటుంబం చేసిందా అంటు నిలదీశారు. ఇప్పటికైనా అమరనాథరెడ్డి తమ సవాల్‌ను స్వీకరించి అభివృద్ధి పనుల పరిశీలనకు రావాలని కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, కౌన్సిలర్లు రెడ్డెమ్మ, రేష్మా, కాళిదాసు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అమరేంద్ర పాల్గొన్నారు.



ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తున్న కృష్ణమూర్తి, అలీమ్‌బాషా

జగనన్న రాకుంటే పథకాలు రావు

పుంగనూరు: ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాకపోతే సంక్షేమ పథకాలు రావని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కమతంపల్లెలో శనివారం ఆయన 'మేము సిద్ధం-మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలసి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, ఎమ్మెల్యేగా డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, ఎంపీగా పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. పట్టణంలోని సుబేదారువీధిలో సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, కౌన్సిలర్ కిజర్‌ఖాన్ ఆధ్వర్యంలో గడప గడపకు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల కోసం ఉమ్మడి పార్టీ అభ్యర్థులు మాయమాటలతో ఓటర్లను మోసగించేందుకు తప్పుడు హామీలు ఇస్తారని వాటిని నమ్మవద్దని చెప్పారు. 30 ఏళ్ల పాలనలో జరగని అభివృద్ధిని ఐదేళ్ల పాలనలో జగనన్న చేసి చూపించారని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరిగిందాలేదా అన్న విషయాలను గమనించాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కమతంపల్లెలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి యాదవ్



పట్టణంలో ప్రచారం చేస్తున్న ఫకృద్దీన్ షరీఫ్, కిజర్‌ఖాన్

ఫ్యాను గుర్తుపై ఓటేద్దాం.. జగనన్నను గెలిపిద్దాం

రొంపిచెర్ల: సాధారణ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి, సంక్షేమ పథకాలను గడప వద్దనే అందుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా జరగని అభివృద్ధి ఈ ఐదేళ్లలో జగనన్న హయాంలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి చేసి చూపించారని గుర్తుచేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేసిన వారిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ నాయకులు చెప్పే తప్పుడు హామీలను ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరంతుల్లా బేగ్, అలీంఖాన్, లక్ష్మయ్య, చిన్న నాగరాజ, కరీముల్లా, అబుబక్కర్, గురు, మస్తాన్, కాలేషా, మల్లికార్జున రెడ్డి, అల్లాబక్స్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మండుతున్న ఎండలు .. జనం బెంబేలు

- 40 డిగ్రీల సెల్సియస్ దాటిన ఉష్ణోగ్రతలు
- ఉదయం 9 గంటల తర్వాత బయటకు రాని జనం
- ఆందోళన చెందుతున్న పట్టణ ప్రజానీకం





తీవ్రమైన ఎండలతో పట్టణంలో బోసిపోయిన పద్మశ్రీ సర్కిల్

పలమనేరు: చిత్తూరు జిల్లాలోనే హార్సిలీహిల్స్ తర్వాత అత్యంత చల్లనైన ప్రదేశం పలమనేరు ప్రాంతం. ఇక్కడ వేసవిలోనూ మంచు కురవడం సర్వ సాధారణం. ఇక్కడ అత్యధిక ఉష్ణోగ్రతలు 34 డిగ్రీల సెల్సియస్ మాత్రమే. దీంతో పలమనేరును పేదవాని ఊటీగా పిలుచుకుంటారు. గతంలో దేశాన్ని పాలించిన బ్రిటీష్ అధికారులు పలమనేరును వేసవి విడిదిగా పెట్టుకున్నారు. ఇక్కడ ఆనాడు బ్రిటీష్ వారు కట్టిన భవనాలు ఇప్పటికీ చరిత్రకు సాక్ష్యాలుగా ఉన్నాయి. ఇదంతా గతం. ఈ సంవత్సరం ఇక్కడి వాతావరణంలో మార్పులొచ్చాయి. ఉష్ణోగ్రతలు వారం రోజులుగా 37 డిగ్రీల నుంచి 40 డిగ్రీలకు చేరాయి. ఉదయం 9 గంటల నుంచే రోడ్లపైకి జనం రావడం లేదు. గతంలో వేసవిలోనూ ఇక్కడ ఫ్యాన్‌లతో పని ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఫ్యాన్‌లు లేకపోతే ఉక్కపోతను భరించలేని పరిస్థితి ఏర్పడింది. వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారడంతో పేదవాని ఊటీ మండిపోతోంది.

40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

పలమనేరులో ప్రస్తుతం 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత దాటింది. ఈ సంవత్సరం ఇక్కడ వేసవిలో నమోదైన ఉష్ణోగ్రతలు గరిష్ఠం 30 నుంచి 39గా ఉండేవి. కానీ ఈ దఫా వడగాడ్పులతో కూడిన ఎండల కారణంగా ఉష్ణోగ్రత 40 డిగ్రీలను దాటుతోంది. సాధారణంగా ఇక్కడ ఏప్రిల్ చివరి వరకు ఉదయం 9 గంటల వరకు గతంలో మంచు కురిసేది. జాతీయ రహదారిపై వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఉండేది. సాయంత్రం 4 గంటల నుంచే మంచుతో కూడిన చలిగాలులు రాత్రి మొత్తం ఉండేది. పట్టణానికి మూడు వైపులా కౌండిన్య అభయారణ్యం విస్తరించి ఉంది. ఆ అడవుల్లోని పచ్చదనంతో ఈ ప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడేది. దానికి తోడు భౌగోళికంగా ఈ ప్రాంతం సముద్రమట్టానికంటే 1350 అడుగుల ఎత్తున ఉండడంతో చల్లటి వాతావరణం ఉండేది. అయితే గత కొన్నేళ్లుగా వాతావరణ పరిస్థితులు క్రమంగా క్షీణిస్తున్నాయి. కౌండిన్య అభయారణ్యం పలుచబడడం, పెరిగిన కాలుష్యంతో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోయాయి.

బలహీనంగా కౌండిన్య అటవీప్రాంతం

ఇక్కడ ఉష్ణోగ్రతలు ఏటా పెరిగిపోవడానికి ప్రధాన కారణం. సమీపంలోని కౌండిన్య అటవీ ప్రాంతం బలహీనమవుతోంది. అడవిలోని వృక్షాలు నేలకొరుగుతున్నాయి. ప్రతి వేసవిలోనూ అడవికి నిప్పు పెట్టడంతో కి.మీ మేర అటవీ ప్రాంతం ఎడారిలా మారుతోంది. దీంతో పచ్చదనం కరువై వడగాల్పులు పట్టణంలో వీస్తున్నాయి. ఇళ్లముందు గతంలో మొక్కలు పెంచేవారు. ఇప్పుడు పట్టణం కాంక్రీట్ జంగిల్‌లా మారింది. ఈ పరిణామాలతో స్థానికులు సైతం తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో విరివిగా మొక్కలను పెంచి పచ్చదనాన్ని పెంపొందించుకోకపోతే ఈ ప్రాంతం మరింత భగ్గుమనడం ఖాయం.

ప్రచారానికి తప్పని ఎండదెబ్బ

తీవ్రమైన ఎండ కారణంగా ప్రధాన పార్టీల ప్రచారాలు సైతం పూర్తి స్థాయిలో మొదలు కాలేదు. ఇంత ఎండలో ఎట్టబ్బా ప్రచారం చేసేది అంటున్నారు జనం. దీంతో నాయకులకు సైతం ఎండదెబ్బ తప్పడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే వచ్చేనెల ఎన్నికలు పూర్తయ్యేవరకు ఎండలతో ఎలా ప్రచారం చేసేదన్న బెంగ అభ్యర్థులను కలవరపెడుతోంది.

కర్ణాటక మద్యం స్వాధీనం

వి.కోట: కర్ణాక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి వి.కోట మండలం పేర్నంబట్ రోడ్డులోని పాపేపల్లిమిట్ట వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో ముదరందొడ్డి పంచాయతీ ఏడుచుట్లకోటకు చెందిన హరీష్, కుంబార్లపల్లి పంచాయతీ ముమ్మిడేర్లపల్లికి చెందిన విజయ్‌ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.41,328 విలువైన 59,040 లీటర్ల మద్యం ప్యాకెట్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు బీసీ ఆత్మీయ సమావేశం

ఐరాల: పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ ఆత్మీయ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు తవణంపల్లె మండలం క్రాస్ రోడ్ సమీపంలోని నారాయణాద్రి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ హాజరువుతారన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ నేతలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.